- ప్రజల దీవెనలతోనే రెండోసారి ప్రభుత్వం
- అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- క్రైస్తవులకు దుస్తుల పంపిణీలో ఎంపీ వినోద్, ఎమ్మెల్యేలు ఈటల, గంగుల, రసమయి

# అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

**తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ/ హుజూరాబాద్ టౌన్/ కరీంనగర్ కల్చరల్:** అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీమంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్ మండలం అల్గునూర్ లక్ష్మినర్సింహా గార్డెన్‌లో నియోజకవర్గంలోని క్రైస్తవులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఎంపీ వినోద్ దుస్తులు పంపిణీ చేశారు. హుజూరాబాద్‌లోని సాయిరూపా ఫంక్షన్‌హాల్, జమ్మికుంటలోని ఎంపీఆర్ గార్డెన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నగరంలోని సీఎస్‌ఐ సెయింట్ మార్క్స్ చర్చ్ మైదానంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని క్రైస్తవులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా అల్గునూర్‌లో ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవ సోదరుల వద్ద ప్రేమ, ఆప్యాయతలు ఎక్కువగా ఉంటాయనీ, క్షమించే గుణం ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ నాలుగున్నరేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారనీ, ప్రజల దీవెనలు ఆయనపై ఉండడం వల్లే రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. పేద ప్రజల కోసం మంచి పథకాలను తీసుకువస్తున్న సీఎం కేసీఆర్ మరింత ధృడ సంకల్పంతో ముందుకు సాగాలని ప్రార్థించాలని కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు క్రైస్తవుల సంక్షేమాన్ని పట్టించుకోలేదనీ, కానీ సీఎం కేసీఆర్ వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వ స్థలంలో చర్చిల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు క్రిస్మస్ కేక్ కట్ చేసి, బట్టలు పంపిణీ చేశారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా స్వయంగా ఎంపీ, ఎమ్మెల్యే వడ్డించారు. ఇక్కడ జిల్లా మైనార్టీ అధికారి పవన్‌కుమార్, జడ్పీ సభ్యురాలు ఉల్లెంగుల పద్మ, ఎంపీపీలు బూడిద ప్రేమలత, విజ య, ఐలయ్య యాదవ్, కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగూరి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


తిమ్మాపూర్ : అల్గునూర్‌లో క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీ వినోద్, ఎమ్మెల్యే రసమయి

## అర్హులందరికీ డబుల్ ఇళ్లు : ఈటల

అర్హులైన క్రిస్టియన్లకు త్వరలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. హుజూరాబాద్, జమ్మికుంటలో ఆయన మాట్లాడుతూ అన్ని మతాలవారిని టీఆర్‌ఎస్ ప్రభుత్వం సమానంగా చూస్తున్నదనీ, దేశంలోనే అధికారికంగా అందరి పండుగలను నిర్వహిస్తున్న ఏకైక ప్రభుత్వం టీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. గత పాలకులు చేయలేని పనులను రాష్ట్ర ప్రభుత్వం చేసి నిరుపిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో చర్చిల నిర్మాణం కోసం గత ప్రభుత్వాలు మొండి చెయ్యి చూపాయనీ, తాను ఒక్కో చర్చికి రూ.10లక్షలకు పైగా ఇచ్చినట్లు గుర్తు చేశారు. క్రైస్తవుల శ్మశాన వాటికల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి రూ.5లక్షలు ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. జెరుసలెం వెళ్లదల్చుకున్న క్రైస్తవులకు రూ.20 వేలు ప్రభుత్వం అందజేసేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు గతంలో రూ.లక్ష రుణం అందించి అందులో 30వేలు మాత్రమే సబ్సిడీ ఉండేదని, అయితే ఇప్పుడు పూర్తి సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు. పరమత సహనం, శాంతిని, ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించే తత్వం క్రిస్టియన్లకు ఉందన్నారు. ఇక్కడ ఆర్డీవో బి చెన్నయ్య, తహసీల్దార్ పీ హరికృష్ణ, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## కలిసిమెలిసి జీవించాలి : గంగుల

దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల పండుగలకు పేద ప్రజలకు దుస్తులను పంపిణీ చేస్తుందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లో ఆయన కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో అన్ని కులాల వారు, అన్ని మాతాల వారు కలసిమెలసి జీవించాలని ఆకాంక్షించారు. ప్రపంచ శాంతి కోరుకునే వ్యక్తి క్రీస్తు ఒక్కడే అని పేర్కొన్నారు. మైనార్టీల పండుగలను అధికారికంగా నిర్వహించే ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమనీ, తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. పేద క్రైస్తవ సోదరుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ పాటుపడుతానని అన్నారు. ఇక్కడ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎంఎఫ్‌సీ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, ఎంపీపీ వాసాల రమేశ్, కార్పొరేటర్ ఏవీ రమణ, బండారి వేణు, నందెల్లి మహిపాల్, వాలరమణారావు పాల్గొన్నారు.


హుజూరాబాద్ టౌన్ : క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఈటల


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు

# కళలకు పుట్టినిల్లు కరీంనగర్

- ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీ నారదాసు
- హాజరైన జడ్పీ అధ్యక్షురాలు, నగర మేయర్
- అట్టహాసంగా అక్కినేని అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవం


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

**కరీంనగర్ కల్చరల్:** కళలకు పుట్టినిల్లు కరీంనగర్ జిల్లా అని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (ఏఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో పద్మభూషన్, నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని 5వ అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరై ఏఎఫ్‌ఏ సావనీర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు కరీంనగర్‌ను కళల జిల్లాగా భావించి రావడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఫౌండేషన్ సంస్థ ద్వారా ఐదోసారి కరీంనగర్ జిల్లాలో నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందిచేవారికి పురస్కారాలతో గుర్తింపు ఇవ్వడం వల్ల ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ మాట్లాడుతూ కవులను, కళాకారులను ఒక వేదిక ద్వారా కలపడం సంతోషకరమన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ తాను ఉపాధ్యాయుడిగా పని చేసిన గ్రామం మేడిపల్లికి తన అవార్డును అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. సకుటుంబ సపరివార సమేతం సినిమాలో ఏఎన్‌ఆర్‌కు పాట రాసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఏఎఫ్‌ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో నిష్ణాతులకు అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. సినీ నటి జమునకు 'జీవన సాఫల్య', మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే నాగేశ్వర్‌కు 'విద్యారత్న', సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజకు 'సినీ రత్న', ప్రముఖ హరికథా భాగవతార్ డాక్టర్ ముప్పవరపు సింహాచలశాస్త్రికి 'రంగస్థల రత్న', పారిశ్రామిక వేత్త సజ్జా కిశోర్‌బాబుకు 'విశిష్ట వ్యాపార రత్న', ప్రతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(పిమ్స్)కు 'వైద్యరత్న', వనజీవి దరిపెల్లి రామయ్యకు 'సేవారత్న', ప్రముఖ హస్త కళాకారిణి డాక్టర్ కమలా ప్రసాదరావుకు 'వినూత్న రత్న', మాస్టర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ చెరుపల్లి వివేక్ తేజకు 'యువరత్న' పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో సినీనటి జమున, పిమ్స్ నిర్వాహకులు పురస్కారాలు తీసుకునేందుకు అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు. ఏఎఫ్‌ఏ అధ్యక్షుడు రావు కల్వల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ రవీందర్‌సింగ్, ఎంపీపీ వాసాల రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, ఏఎఫ్‌ఏ ఉపాధ్యక్షుడు శారద అకునూరి, కార్యదర్శి చలపతిరావు, కోశాధికారి భక్తవత్సలు, డాక్టర్ సీఆర్‌రావు, మురళి వెన్నం పాల్గొన్నారు. కాగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు.


సావనీర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంగుల, జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, మేయర్, తదితరులు




పురస్కారం అందుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు వీ నాగేశ్వర్ దంపతులు(విద్యారత్న), డాక్టర్ కమలా ప్రసాదరావు(వినూత్న రత్న), సజ్జ కిశోర్‌బాబు(విశిష్ట వ్యాపార రత్న)



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, జడ్పీఅధ్యక్షురాలు